# సీనియర్ కామ్రేడ్ గిడుతూరి చంద్రంకు జోహార్లు



**సీనియర్** కామ్రేడ్, సిపిఐ(ఎం-ఎల్) సభ్యులు, కా॥ గిడుతూరి చంద్రం (70 సం॥లు) 23-4-17న గుంటూరులో మరణించారు. కా॥ చంద్రం 1947లో తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట తాలూకా వీరవరంలో జన్మించారు. చిన్ననాడే తల్లిదండ్రులను కోల్పోయిన కా॥ చంద్రం, బ్రతుకుదెరువు కోసం మద్రాసువెళ్ళి, అక్కడ ఇమడలేక 1965 నాటికి గుంటూరు చేరుకున్నారు. హోటల్ వర్కర్‌గా గుంటూరులో జీవితాన్ని ప్రారంభించిన కా॥ చంద్రం, హోటల్ వర్కర్స్ సమస్యలపై దీర్ఘకాలం సాగిన ఆందోళనలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ క్రమంలో నాటి సిపిఐ(ఎం)తోనూ, ఆనాటి విద్యార్థి నాయకులతోనూ కమ్యూనిస్టు రాజకీయ సంబంధాలలోకి వచ్చారు. కమ్యూనిస్టు పుల్లయ్యగారి కుమార్తె లక్ష్మిని ఆయన వివాహం చేసుకున్నారు.

కా॥ చంద్రం కడదాకా కష్టజీవుల, శ్రమజీవుల రాజ్యస్థాపన కోసం కృషి సాగించే రాజకీయాలవైపే నిలిచారు. ఆరోగ్యం అనుమతించిన వరకు తన స్వీయ శ్రమపై ఆధారపడి, తినుబండారాలు తయారుచేసి, పూలకొట్ల సెంటర్, బంగారపు కొట్ల వద్ద అమ్మి, జీవనం సాగించారు. (ఉప్మా చంద్రంగా ఆయన పేరు గుంటూరులో ఎక్కువమందికి సుపరిచితం) ఈ పని చేసుకుంటూనే పార్టీ సాహిత్యం - పత్రికలు, కరపత్రాలను విస్తృతంగా సంగడి గుంటలోను, వివిధ శ్రేణుల మధ్య ప్రచారం చేసేవారు. శ్రమజీవుల సమాజంకోసం జరిగే కృషిలో తన జీవితంలో కొంత భాగాన్ని వెచ్చిస్తూ, దాని గురించి ఆలోచిస్తూ తపన చెందేవారు. ఆ రాజకీయాలతోనే చివరివరకూ కొనసాగారు. కా॥ చంద్రం మృతిపట్ల సిపిఐ(ఎం-ఎల్) నగర కమిటి సంతాపం ప్రకటిస్తూ వారికి జోహార్లర్పిస్తున్నది. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియబరుస్తోంది.

ooooo